ఏకాంకిక:



# పురాణ ప్రభావం

ఎ. వి. మోహన్

[ఇంటి వసారాలో వాకవేపు దీపం వుండదు. మసక మసకగా వుంటుంది. పెద్ద తక్తా బల్లగాని లేక మామూలు బెంచిగాని వుండి దానిమీద ఒక కొసను నిండుగా వున్న చేతిసంచి, గొడుగు కనిపించుతూ వుంటవి. మధ్య మధ్య వీధి వేపు పరకాయించి చూస్తూ యింటి యజమాని అటూ ఇటూ పచారు చేస్తూవుండగా వారి కుటుంబ మిత్రుడు దారే పోతూ యింటివేపు చూసి]

మిత్రుడు : బావా! నువ్వేనా?

యజమాని : నేనుకాకపోతే 'బావా' అని యెవర్ని పలకరిస్తున్నావు?

మిత్రుడు : సంధ్యవేళ దీపం గీపం లేకుండా వసారాలో తారుతుంటేను అవునా కాదా అని అనుమానించాలే.

యజమాని : తారుతున్నానంటావు! అవును, నా యింటినుండే నేను తారుతున్నానని నీబోటివాళ్ల చేత అనిపించుకోవాల్సిన కర్మ పట్టింది నా కివ్వాళ మరి. ఇట్లా యెంతసేపు నిరీక్షిస్తూ వడిగాపులు పడుండాలో తెలియటంలేదు.

మిత్రుడు : సంచీ, వ్యవహారం, అంతా చూస్తే యిప్పుడే రావటంలా కనిపిస్తుంది. అవునౌను! యీ మధ్య వూళ్లో లేవుకదూ! (వసారా యెదురుగా వున్న వీధి దీపం వెలుగుతుంది. దానివేపు తిరిగి చెంపలు వాయించుకుని నమస్కారం చేసి కళ్ళు నద్దుకున్నట్టు చేతులు తిప్పుతాడు. వీధి దీపం వెలుగులో రంగస్థలంమీదివారు చక్కగా కనిపిస్తూ వుంటారు.) అక్కగారు, పిల్ల కోవెలకు పురాణం వినటానికి వెళ్లారేమో? వేళ కావచ్చింది. వచ్చేస్తూ వుంటారులే యీపాటికి. అందుకా యీ చిరచిర అంతాను?

యజమాని : చిరచిర కాకపోతే యేమిటి నాకు తెలియక అడుగుతాను! తిరిగి తిరిగి కొంపకు చేరితే కాళ్ళు ముఖం కడుక్కొని కాసిని మంచినీళ్ళు తాగే యోగమున్నా లేకపోతే! పురాణాలుట పురాణాలు! పదిమంది ఆడపీను గుల్ని చేరబట్టటానికి కాకపోతే యెందుకీ పురాణాలు? ఆచెప్పేవాడికి కఘోరించిందా, యీవినే వాళ్ళకేడిచిందా భక్తి?

మిత్రుడు:—నువ్వు వాళ్ళను యెప్పుడూ యే సినిమాకూ తీసుకెళ్ళవు సరికదా, పోనీ నన్నా పోనీవా యె. ఊళ్ళో లేవు కదా ఎటూ అని, పురాణం వినటం కూడనిప నేమీ కాదుగదా అని, వెళ్ళుంటారులే. మంచి నీళ్లు కావాలిస్తే, అపక్క మీతమ్ముడి ఇల్లు యీపక్క పెత్తండ్రి యిల్లూకద, వెళ్ళి తాగి రారాదు? పోనీ నన్ను తెచ్చిపెట్టమంటావా?

యజమాని:— నేను పోయి తాగిరానూ అక్కర్లేదు, నువ్వు లేనూ అక్కర్లేదు వారికీ మాకూ గల సమోగ్యత యీవూళ్ళో తెలియందెవరికి? నువ్వేం యెరగనట్టు మాట్లాడుతావు?......సరేగాని, మా తమ్ముడి కూతుర్ని చూట్టానికి హైదరాబాదు నుంచి యెవరో పెళ్ళికొడుకు దిగుతాడని విన్నాను. చూసెళ్లాడేమో?

మిత్రుడు:—అసలు సంగతి నీదాకా రాలేదన్నమాట! హైద్రాబాదు అబ్బాయి యిప్పటికో పది పదకొండేళ్లనుంచి వండుకు తింటూ ఉద్యోగం చేసుకుంటున్నాట. అతగాడికి అదే అలవాటై పోయిందిట. అందుచేత పెళ్లి చేసుకుందామనే మాటే తలపెట్టటం లేదు అని అతడి మేనమామగారు మీ తమ్ముడికి ఉత్తరం రాశాడు.

యజమాని:—అంటే, పెళ్లాం వండిపెట్టటానికే అని అతగాడి వుద్దేశం అన్న మాట. ఈకాలపు కుర్రాళ్ల తెలువులుయిట్లావున్నై!

మిత్రుడు:—అదేమిటి బావా! నాళ్లం తెలివితక్కువ వాళ్లను కున్నావా? కట్నం చాలక అదోవంక పెట్టినట్టుంది.

యజమాని:—ఆ అబ్బాయి చెయ్యికాల్చుకోకుండా వుండాలంటే మరో అయిదు వందలో వెయ్యో దర్శించుకోవాలన్నమాట. పోనీ పెళ్లిచేసుకుంటే మాత్రం యేం? పెళ్లానికి కూడా తనే వుడకేసి పెడుతూ ఉండరాదూ, అంతగా ఆ అలవాటు మానుకోటం చేతకాకపోతే!

మిత్రుడు:—బాగా చెప్పావు! అయినా గుంటూరుజిల్లా గొడ్డుపోయిందీ, పెళ్లికొడుకులకి, హైద్రాబాదుదాకా పరిగెత్తటం యేమిటి?

యజమాని : రాజధాన్ని, యీ బస్తీలేవి పనికిరానట్టు, అక్కడపెట్టలా? అట్లాగే పెళ్ళికొడుకులూ అక్కడివాళ్ళుగాని పనికి రావటం లేదేమో!

మిత్రుడు : అలాగేవుంది చూడగా! సరే గాని, యింతకూ పిల్లదానికి యెక్కడన్నా ఖాయంచేసుకొచ్చావా? బావా!

యజమాని : అబ్బే! లేదోయ్! ఆ తాకట్టుబాకీ యేమన్నా వసూలై తగలడుతుందేమో అని యేటవతలికి వెళ్ళాను. 'మా నాన్న కోలేటిపాలం మహానూలుకు వెళ్ళాడు, రేపో యెల్లుండో వస్తాడు' అని వాళ్ళబ్బాయి అంటే చుట్టుపక్కల చిల్లరా

మల్లెరా చూసుకుంటూ కూర్చున్నాను. మూడురోజులు చూసినా ఆయన రాలేదు. అమోతుమో తేల్చుకుందామని నేనే అవూరు వెళ్ళాను. వారం నాడే ఆయన అక్కడనుంచి దయచేశాడని తెలిసింది. సరే ఓ నోటీసు అంటిద్దాంలే వీడిచుట్టూ యెవరు తిరుగుతాడని యాకాయకీ తిరుగుముఖం పట్టాను. ఆ కొళ్ళేటివూళ్ళకు వోగైళ్ళా, కార్లా? తిండి తిప్పలు లేకుండా కొంపకు చేరితే యెగురుగుండా తాళం పెట్టిన యిల్లు కనిపించిందేగాని యిల్లాలు లేకపోయె. దీన్ని యేమనాలో, యేం చెయ్యాలో అర్థం కావటం లేదు. పురాణానికే వెళ్ళిందో, పుట్టింటికే లేచిపోయిందో! దానికదు పుకొకా! ఆ పురాణానికేమీ దరీ అంతూ వుండదా యేమిటి? పొద్దుతిరక్కముందే వంటలుచేసి పెట్టుకుపోతారా, వచ్చి పొయ్యిరాజేస్తారా అని! యేది! యెక్కడా వస్తున్న జాడే లేదు.

మిత్రుడు: 'ఆ కలిదప్పుల కడల నేలా' అన్నాడు మహాకవి. వస్తావులేవయ్యా! వెళ్ళిన వాళ్ళు రావద్దూ? అందులో ఆ బ్రాహ్మడు 'చవులూరగనోరుబుట్ట' చదువుతున్నాడు పద్యాలు, యిందాక వస్తూ విన్నాను.

యజమాని: ఏమిటే తాగుమారు! నాటకాల పాండిత్యం గామల్లు యిదంతా?

మిత్రుడు: నా పాండిత్యం మాటకేంగాని, ఆమధ్య పిల్లను యెవరో చూసి వెళ్ళారని విన్నా. అన్నివిధాలా మంచిసంబంధమేటగా? లగ్గాలు పెట్టుకుందావటానికి వెళ్ళావేమో అనుకున్నా.

యజమాని: ఆఁ! అదా! కాస్తలో తప్పింది.

మిత్రుడు: అంటే?

యజమాని: మేము బొందను పడటం.

మిత్రుడు: సరికిసరి అప్పుందా?

యజమాని: సారి! వున్నవాటిని గురించి కాదోయ్ వచ్చినబాధ.

మిత్రుడు: అయితే అసలు ఆస్తే లేదంటావా? అంతా బూటకమే?

యజమాని: ఆస్తి పాస్తులమాట అట్లా వుంచు. ఆ అబ్బాయికి అసలు తలకాయే లేదు.

మిత్రుడు: మొగుడు మేధకుడైతే పెత్తనం పెళ్ళాం చేస్తుంది, యింకేం! అయినా యీ రోజుల్లో తెలివి యెవడికొక్కవాలి? కావాలిసింది ఆస్తి. అది పుష్కలంగావుంది. కుర్రాడు చూపరి. పిల్లకంటె వొకచాయ పసిమేట కూడా! తథాస్తు అనుకుంటే పోయేదేమో?

యజమాని: కథంతా వింటే ఆ మాట అనవు.

మిత్రుడు: చెప్పరాదూ! వింటాను

యజమాని: ఏం చెప్పను! జామర్దా కూడా.

మిత్రుడు: ఇందాకా వచ్చి చెప్పకపోవటం యేమిటి? చెబుదూ, యింతలో యేంపోయింది?

యజమాని: అయితే విను. నువ్వు చెప్పినట్టు అన్నీ బాగానే వున్నాయి. కావలసినంత ఆస్తివుంది. ఒక్కడే పిల్లవాడు. మంచి రూపసి. తండ్రి ఇంకా సంపాదిస్తున్నాడు కూడా. యెన్ని వుంటే యేం లాభం, అసలు తలకాయే లేకపోతే?

మిత్రుడు: ఆ లేకపోవటమేమిటో త్వరగా చెబి నేద్దూ, కాస్త వింటాను.

యజమాని: కానీం! పూర్తిగానే విను. నేను పిల్లవాడిని చూట్టానికి వెళ్ళినప్పుడు ఆ అబ్బాయి కాలేజీకి బయల్దేరుతున్నాడు. కుర్రాడి తండ్రి నన్ను కూర్చోమని యేవో పుస్తకాల సంగతి, గుడ్డల గురించి, పచారికొట్లో సరుకులు కటించటం విషయం మాట్లాడాడు. అతనూ సమాధానాలు చెప్పాడు. ఒకత్తి వంది లేదు. బాగానే వుంది. మురుసుకున్నాను సంబంధం కుదిరితే అవునని.

మిత్రుడు: అయితే తలకాయలేని వాడు కాలేజీ చదువు యెలా చదువుతున్నాడూ అని! అసలు చదువుతున్న మాట నిజమేనా?

యజమాని: పరీక్షలు ప్యాసౌతుంటే కాలేజీలోనూ చదవొచ్చు వున్నొగేలూ వెలగపెట్టొచ్చు.

మిత్రుడు: పిల్లనివ్వటానికి పనికిరానంత ఉవ్యక్తుకు అవి మాత్రం ప్యాసుకావటం యెలా?

యజమాని: యెలాగేమిటి? స్కూలు పైనలుదాకా పంతుళ్ళను పట్టుకుని, అక్కడనుంచి పరీక్షల్లో కలుపు నలుపు చేసేది, పచ్చకాయితాలు వుద్చుకు బయల్దేరేది. పరీక్షలు వాటంతట అవే ప్యాసవుతయ్యి.

మిత్రుడు: నీదంతా విడ్డూరం! బియ్యేలు యమ్మేలు కావటం అంతసులువైతే అంతా కావచ్చే?

యజమాని: విడ్డూరం యేముంది? శ్రీమంతులకు అంతా సులువే. లక్ష్మీ ప్రసన్నం వుంటే సరస్వతి వచ్చినట్టు చెప్పిన మాట వింటుంది. అడగటం ఆలస్యంగా యెన్ని డిగ్రీలన్నా తగలేస్తుంది. డిగ్రీలు ప్యాసై సర్వీసు కమీషను పరీక్షకు వెళ్ళి వారక్కడ చెప్పే సమాధానాలు అప్పుడప్పుడు ప్యాపర్లలో పడుతూ వుంటాయి నువ్వెప్పుడూ చూడలా? చూస్తే, వారేమిటో, వారి చదువులేమిటో, డిగ్రీలు ప్యాసుకావటం యేమిటో అర్థం అవుతుంది.

మిత్రుడు: అవునౌను! ...ఊఁ! తరవాత యేమయింది? ఆ సంబంధం కుదిరితే బాగుండునని మురుసుకున్నావు. ఊఁ!

యజమాని: సరే! కుర్రాడి తండ్రీ నేనూ కట్నం, లాంఛనాలు, ఆడిగాగల యీ వస్తు విషయాలూ మాట్లాడుకున్నాం. మనకు అందుబాటులోనే వున్నాడులే, యెక్కడో చెట్టెక్క కూర్చోలేదని కూడా సంతోషించా. ఒక్కతే పిల్ల. మళ్ళీ మళ్ళీ మనం చేసే కార్యాలు గామూలేమున్నాయి కనక? అయిదురోజులు పెళ్ళి చేస్తానన్నాను. "ఇప్పుడు అయిదురోజులు యెవరుచేస్తున్నారండీ? అయినా నాకు అన్నాళ్ళు కూర్చోటానికి తీరుబాటెక్కడ? కుర్రాడికి పరీక్షలు దగ్గిరపడుతున్నవి. ఒక్కరోజుతో ముగించెయ్యండి. కట్నంమాత్రం యింకో రెండువేలు కలపండి" అని మొండికేశాడు. సరే, ఆ రెండు అయిదులకూ తలవూపాను— మహా తగిలితే పెళ్ళి పదహారురోజులపండగ వెళ్ళేప్పటికి యింకో అయిదు తగులుతుంది యింతేగదా అని.

మిత్రుడు: దీకైన సంబంధం కుదరాలి గాని నీకదో లెక్కా?

యజమాని: అవునౌను! అయితే నేం! చివరకు గాని లోపలి లొటారం బైటపడలేదు.

మిత్రుడు: ఊఁ! ఊఁ! వస్తున్నావు.

యజమాని: నేను తల వూపానో లేదో, తక్షణం తాంబూలాలు పుచ్చుకుందామన్నాడు. పిల్లను చూడటం గాని పిల్లవాణ్ణి తీసుకు మా యింటికిరండి, అమ్మాయి, వాళ్ళమ్మకూడా కుర్రవాణ్ణి చూస్తారు, అప్పుడు తాంబూలాలు పుచ్చుకోటం యేమిటి, లగ్గాలూ పెట్టుకుందామన్నాను.

మిత్రుడు: అప్పుడే నీకేదో వాసనేసిందన్నమాట? అవలిస్తే పేగులు లెక్కపెడతావు, మొత్తానికి!

యజమాని: అదే! మనం త్వరపడాలిసిందిపోయి ఆయనగారే అంత తొందరపడుతున్నాడేమిటా అనిపించింది. "అబ్బే! పిల్లవాన్ని చూడక్కరేద" న్నాడు. నా అనుమానం మాగాకేసింది. ఈరోచ్చిన పిల్లలకు పెళ్ళిచేసేప్పుడు అసలు వాళ్ళిద్దరూ చూసుకోటం యెందుకైనా మంచిది. మనం అక్కరలేదనుకుంటాం, పెద్దవాళ్ళం, కాని వాళ్ళలా అనుకోరండీ వచ్చినచిక్కు, మీరు అబ్బాయిని తీసుకు వీలయినంత త్వరలో రండి' అన్నాను. ఏమనుకున్నాడో వెంటనే పంచాంగం తిరగేసి "ఎల్లుండి సాయంత్రం బాగుంది. అయిదుగంటల బండిలో వస్తాము" అన్నాడు.

మిత్రుడు: ఇంతకూ పిల్లవాణ్ణి తీసుకొచ్చాడా? ఒక్కడే దిగాడా?

యజమాని: పడాల్సిన జాగర్తంతా పడతాడుగాని అంత తెలివితక్కువ చేస్తాడా? పుత్రసమేతంగానే దిగాడు. కాని ఆబండి రెండుగంటలు లేటుకావటంతో సరిగ్గా

# ★ పురాణ ప్రభావం ★

పర్ణానికిముందు చేరారు. అవధాన్లుగారు ఇక ఆ పూటకు మంచిదికాదు, మర్నాడు భేషుగ్గా వుందన్నారు. దాంతో ఆరాత్రి యిక్కడ వుండిపోవాలిసొచ్చింది. తండ్రీ కొడుకులకు మాపెత్తల్లిగారియింట్లో వంట చేయించాను.

మిత్రుడు: కలికితే అతకదనా?

యజమాని: కలక్కపోతే అతికేడిచింది కనకనా? అదో వెర్రినమ్మకంగాని.

మిత్రుడు: ఊఁ! సరే! తెల్లారింది.

యజమాని: అప్పుడే యేం తెల్లారటం! ఆ! పిల్లవాడి తెలివి తెల్లారింది! భోజనంచేసి అక్కడే పడుకుంటామన్నారు. అక్కడ చోటు కుశలం, పైగా మంచాలు అవీ యిక్కడనుంచి చేరెయ్యాలి. భోజనాలై వచ్చేప్పటికి పక్కలు యిక్కడ సిద్ధంగా వుంటవన్నాను. తండ్రీ కొడుకులు నిద్ర తూలిపోతున్నట్టు కనిపించారు. భోజనానంతరం మాటలు పెట్టుకోకుండా 'నేనూ, ఆయనా, కొడుకూ వరసగా మూడుమంచాల మీదా పడుకున్నాం. వెన్నెల పిండారబోసినట్టుంది. చంద్రుడు వసారాలోకి కనిపిస్తున్నాడు. పరాయిచోటు కావడంచేతనేమో కుర్రవాడికి నిద్ర పట్టినట్టులేదు. ఓ కొంతసేపటికి నాన్నా నాన్నా అని పిలవటం మొదలుపెట్టాడు. నిద్రపోతున్నానో మేలుకున్నానో అని గాంమల్లు ముందు నావేపు పరకాయించిచూసి, ఏమిట్రా! యెందుకు పిలుస్తున్నావు? నిద్రపట్టెంచుకో" అన్నాడు కొంచెం గద్దింపుగా తండ్రి. "అదికాదు నాన్నా! మరి, యీ వూళ్ళో చంద్రుడూ మనవూళ్ళో చంద్రుడూ ఒక్కడేనా?" అని ఆ పుత్రరత్నం తన శంకను వెళ్ళబెట్టాడు. ఘోర పిడుగా! అనుకుని తెల్లవార్లూ నిద్ర పట్టకపోయినా నిద్రిస్తున్నట్టే పడుకున్నాను.

మిత్రుడు: పిడుగేమిటి! పిడుగున్నర! బియ్యే చదువుతున్నాడూ! బాగుంది!

యజమాని: ఆఁహా! దాందేమిటి! కృష్ణమీనన్ను గురించి నీకు తెలిసింది వ్రాయుము అంటే నల్లసముద్రంల్లో దొరికే అదోజాతిచాప అనీ నల్లగావుంటుందనిరాసిన ఆసామికంటె యితడేం తక్కువతిన్నాడా?

మిత్రుడు: తక్కువ! రెండాకులెక్కువే చదివాడు.

యజమాని: ఇప్పటి చదువులే అంత ఆశ్చర్యపడాలిసిందేమీ లేదు. చూడు! అదుగో! ఆపైన, వీధి దీపం వెలుతుర్లో, మాయింటిదేనల్లే వుంది వస్తోంది, మందగమనంతో, నాకు చూపానదు.

మిత్రుడు: అబ్బే కాదుబావా! ఆకలి తొందర్లో అందరూ నీకు అక్కగారిలానే కనిపిస్తున్నట్టున్నారు. ఆవిడ అలాయెందుకు నడుస్తుంది?

యజమాని: ఎంత మూపానకపోతే మాత్రం! మా ఆవిడ నడక నేను గుర్తించలేనాయేం? ఆ! ఆవిడగారే! దయచేస్తున్నారు. పురాణశ్రవణంవల్ల సంప్రాప్తించిన పుణ్యం అంతబరువుగా వుందేమో! అడుగు ముందుకు పడటంలేదు.

మిత్రుడు: ఆఁ! అక్కగారే! ఒక్కతే వస్తుంటేను కాదేమో అనుకున్నా. నువ్వు వొచ్చినట్టుతెలిసి పురాణం పూర్తికాక పోయినా వచ్చేస్తోందనుకుంటా.

యజమాని: పురాణంకాదు! పురాణ జ్వరం! ఇదిరోజూ సాయంత్రం యిట్లా యెన్నాళ్ళు వేధించాలో!

మిత్రుడు: ఊఁ! నీదంతా మరీ చాతురు. లేచిందగ్గిర్నుంచి వంటా పెట్టాతో ముణగానాం తేలానాం. యేనోయెప్పుడన్నా యిట్లా కాస్త పురాణానికన్నా వెళ్ళకపోతే వాళ్ళకు విశ్రాంతియేది?

[యజమానిభార్య ప్రవేశించుతుంది. విలువైనదుస్తులు, ఆభరణాలు ధరించివుంటుంది. పూర్తిగా కాకపోయినా మొత్తంమీద ఆధునికమైన వేషం.]

యజమాని: ఎక్కడదన్నావే యింతసేపు!? పొద్దుపోకిందా? ఇల్లూ వాకిలి యిప్పటికిగాని గుర్తురాలేదు! పాతేసినా పాపంలేదే!

భార్య: మిమ్మల్ని చూడగానే యేదో శుభవార్త చెబుతారనుకున్నాను. చావులూ, పాతిపెట్టటాలతో ప్రారంభించారు. అంత కోపం యెందుకండీ!

మిత్రుడు: (బ్రహ్మవేత్త, వేదవ్యాసుడి అంతవాడికే రెండుపూటలు తిండిలేకపోతే ఒళ్ళుపై తెలియలేదు. బావకి కోపంరావటం పోలెక్కాజమా!

యజమాని: పిల్లదియేది? పురాణం పూర్తయిందా?

భార్య: పురాణం పూర్తికాగానే యిద్దరం బయలుదేరాం. సీతమ్మగారి సావిత్రితో మాట్లాడుతూ అది వెనకపడ్డది. వస్తూవుండాలి.

యజమాని: పూర్తికాకుండా నువ్వెందుకొస్తావు! సీత! సావిత్రి! అంతా పతివ్రతలు మొలుచుకొచ్చారు! అఘోరించినట్టే వుంది. వంట తొందరగా యేదు. రెండు మెతుకులు నంజి పడుకుండాలని వుంది. తాళంచెవు లిట్లా తగలెయ్యి.

(భార్య తాళంచెవులు యిస్తుంది. యజమాని యింటతాళం తియ్యటానికి పోబోతుండగా)

మిత్రుడు: నీకోపం సరేగాని, వూళ్ళో అందరిమీదా విరుచుకుంటున్నావేమిటి? కాస్త నిమ్మళం యెవరన్నా వింటే...

యజమాని: వింటే! పొట్లాటకొస్తారంటావు? రానీ! వాళ్ళబతుకులే బయట పడతెయ్యి.

భార్య: పొద్దుట్నుంచీ భోజనం చెయ్యలేదా యేమిటండీ? తమ్ముడూ! నీభోజనం అయిందా? వంట యెంతసేపు, నిమిషం! మీస్నానం అయ్యేటప్పటికి నా వంటా అవుతుంది.

[యజమాని తాళంతీసి యింట్లోకి వెడతాడు. భార్య బల్లమీద సంచీ, గొడుగూ తను తీసుకుంటూ వుండగా]

మిత్రుడు: మావాళ్ళు పురిటికెళ్ళినప్పటి నుంచి మనది ఏకభాండ ప్రయోగం. వెళ్ళి తినటమే.

భార్య: [లోపలికి వెడుతూ] ఇప్పుడు పోయి ఆ వద్దభోజనం యేం చేస్తావుగాని, మీబావా నువ్వు కలిసి కూర్చుండురుగాని, రా! వెళ్ళకు!

[అంతా లోపలికి వెడతారు. తెర దిగి వెంటనే లేస్తుంది. ఇంటి లోపలిభాగం. ఒక టేబులు మూడు కుర్చీలు ఉంటవి. టేబులు దగ్గరలో వున్న కుర్చీమీద మిత్రుడుఒక్కడే కూర్చుని వుంటాడు, టేబులు మీది పుస్తకం తీసి,]

[మిగతా వచ్చేవారం]

**తెల్ల వెంట్రుకలుండవు**

(GOVT REGD)

రంగులనుచూచి మోసపోవద్దు.అది తాత్కాలికము మా సువాసన "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది 60 సం॥ ల వయస్సువరకు వెండ్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు జ్ఞాపకశక్తిని కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు 5-0-0. 3 సీసాలు రు.12-0-0, సగము నెరసివుంటే ఒక సీసా రు. 6-0-0 3 సీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/- లు 3 సీసాలు రు 18/- లు పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును కోరినవారికి వుచిత.

GENERAL LABORATORIES,
(P. W) P.O. Rajdhanwar (H. Bhag.)

# పురాణ ప్రభావం

ఎ. వి. మోహన్



[గతసంచిక తరువాయి]

మిత్రుడు: రుక్మిణీ కళ్యాణం. టీకా తాత్పర్య సహితం. ఓయబ్బో! పురాణం వినటం కాకుండా పద్యం పద్యం అర్థ సహితంగా బట్టీ వేస్తోందా ఏమిటి కోడలు.!

భార్య:—(గరాటుతో వున్న కిరసనాయిలు సీసా నిప్పు పెట్టె పట్టుకుని లోపలినుంచి వచ్చి) శాస్త్రుల్లుగారు యెంత బాగా చెబుతున్నారనుకున్నావు. అరిటిపండు వొలిచి చేతులో పెట్టినట్టు అర్థం ఆయన వివరంగా వినిపిస్తుంటే కథ కళ్ళకట్టినట్టుంటుంది. పుస్తకం యింట్లోవుంటేను, తనివి తీరక, మధ్యాన్నం వేళ మళ్ళా అమ్మాయి ఆ పద్యాలన్నీ చదువుతూ వుంటుంది. (లోపలికి వెడుతుంది.)

మిత్రుడు: (గుర్తు పెట్టివున్న చోట పుస్తకం తెరిచి కొంచెంసేపు మూసి పైకి చదువుతాడు)

ఉ॥ అన్న తలంపు దా నెరిగి యన్న వనీరజ
గంధి లోనవా
పన్న తనొంది యాప్తుడగు బ్రాహ్మణు
నొక్కని జీరిగర్వసం
ఛన్నుడు రుక్మి నేడు నను జైద్యున
కిచ్చెదనంచునున్న వా
డన్ని విధంబులం జని బుధీశ్వర,
చక్రికి విన్నవింపవే.

తాను ఏరి కోరివలచి వివాహమాడ దలచిన శ్రీకృష్ణులవారికి ఇంట్లో ఎవరికీ తెలియకుండా రహస్యంగా వో బ్రాహ్మణోత్తముడి ద్వారా ప్రణయ సందేశం పంపింది రుక్మిణీదేవి. అంత సాహసం అమ్మవారు కనక చేసిందిగాని...

భార్య: (ఇస్త్రీ తుండుగుడ్డ చేత్తో పుచ్చుకుని ప్రవేశించి) నువ్వు పద్యాలింత బాగా చదువుతా వనుకోలేదు తమ్ముడూ! ఆపై పద్యం చదువు. అన్నగారిని వారించే శక్తి తండ్రికి లేకపోవటంచేత రుక్మిణీ అమ్మవారు అలా సాహసించాలిసొచ్చింది. (లోపలికి వెడుతుంది.)

మిత్రుడు:

క॥ అయ్యా! కొడుకు విచారము
లయ్యయు వారింపజాల డటు గాకుండన్
నెయ్యు మెరిగించి చీరుము
చయ్యన నిజసేవకాను సారిన్ శౌరిన్.

[వచనం వచ్చినప్పుడల్లా కొంత పైకి, కొంత లోపల్లోపలా చదువుతూ వుంటాడు. తనలో చదివేదికూడా అస్పుటంగా ప్రేక్షకులకు వినిపించుతూ వుంటుంది.]

వ॥ అనికొన్ని రహస్యవచనంబులు సెప్పిన విని బ్రాహ్మణుండు ద్వారకా నగరంబునకుం జని......పురుషోత్తముంగాంచి పెండ్లి కొడుకవుగమ్మని దీవించిన ముసిముసినగవులు నగుచు..................

ఉ॥ ఎవ్వని దేశమందునికి ధీయ్యనిచే సుకే
లంబుగల్గు మీ
కెవ్వని రాజ్యమందు ప్రజలెల్ల సుఖిం
తురు వాడు మత్ప్రియుం
డివ్వనరాశి దుర్గమున కెట్లరుదెంచితివయ్య
నీవు నే
నవ్వులుగావు నీ తలపునంగల చేలొనర
ింతు ధీమణీ!

వ॥ అనియిట్లు లీలాగృహీత శరీరుండైన యప్పరమేశ్వరుం డడిగిన ధరణీ సురవరుం డతనికి సవినయంబుగా నిట్లనియె. దేవా విదర్భ దేశాధీశ్వరుండైన......

......డా రాజుకూతురు రుక్మిణి యను కన్యకామణిగల దయ్యిందువదన నీకు...... వివాహమంగళ ప్రశస్తంబయిన యొక్క సందేశంబు విన్నవింపుమని పుత్తెంచె నవధరింపుము.

సీ॥ ఏనీగుణములు కర్ణేంద్రియంబుల
సోకదేహతాపంబులు తీరిపోవు
నేనీ శుభాకార మీక్షింప కన్నుల
కఖిలార్థలాభంబు కలుగుచుండు
నేనీ చరణసేవ లేప్రొద్దు జేసిన
భువనోన్నతత్వంబు బొందగలుగు
నేనీల సన్నామ మేప్రొద్దు భక్తితో
దడవినబంధ సంతతులువాయు
నట్టి నీయందు నాచిత్త మనవరతము
నచ్చియున్నది నీయాన నానలేదు
కరుణజూడుము కంసారి, ఖలవిదారి
శ్రీయుతాకారమానినీ చిత్తచోర!

భార్య: (వెనుకటి విలువైన దుస్తులు అతగాలు తీసేసి మామూలు వంటయింటి వేషంలో ప్రవేశించి) పద్యాలు చక్కగా చదవగలవుగదా! వదిలిపెడతావెందుకు, వరసగా చదవరాదూ? ఎన్నిసార్లు విన్నా, మళ్ళీ మళ్ళీ వినాలనే వుంటుంది.

మిత్రుడు: శ్రీకృష్ణపరమాత్మ గాథలే అట్లాంటివి! అందులో పోతన్నగారు అద్భుతంగా చిత్రించారు.

భార్య: అందులో నూ శాస్త్రుల్లుగారు చదివి చెబుతుంటే మనస్సు మనమే మరిచిపోతాం, యిల్లువాకిలి సంగతట్టావుంచి,

మిత్రుడు: "నన్ను తీసుకుపోయి రాక్షస వివాహం చేసుకోవలసింది" అని స్పష్టంగా కబురు పెట్టింది రుక్మిణీదేవి. శ్రీకృష్ణులవారి

# ★ పురాణ ప్రభావం ★

మీద ఆమె మనసు అంత గాఢంగా నాటుకు పోయింది మరి.

భార్య: "......రాక్షస వివాహమునన్ భవదీయ శౌర్యమే యుంకువ జేసి కృష్ణ పురుషోత్తమ చేకొని పొమ్ము వచ్చెదన్." అంతే కాదు తల్లిదండ్రులకు ఆప్తవర్గానికి హాని కలక్కుండా తనను తీసుకుపోయే అపాయం లేని ఉపాయంకూడా తెలియచేసింది.

మిత్రుడు: అవును. ఇదుగో! యిక్కడ పద్యం వుంది. యీ సీసాలు రాగయుక్తంగా అనాలంటే టంగులు తెగుతయ్యి.

సీ॥ లోపలి సౌధంబులోన వర్తింపంగ
దేవచ్చునే నిన్ను దెత్తునేని
గావలివారల గలబంధువుల జంపి
కాని తేరాదని కమలనయన,
భావించితే నినుపాయంబు సెప్పెద
వాలింపు కులదేవ యాత్రజేసి
నగరంబు వెలువడి నగజాతకును మ్రొక్క
బెండ్లికి మునుపడ పెండ్లికూతు
వెలయ మావారు బంపుదు రేనునట్ల
పురము వెలువడి యేతెంచి భూతనాథు
పతికి మ్రొక్కంగ నీవునా సమయమందు
వచ్చి కొనిపొమ్ము నన్ను నవార్యచరిత.

ఎంత తెలివి అనుభవం లేకపోతే అంత చక్కని ఉపాయం తోస్తుంది! ఆహాహా! ఏమి ఉపాయం! యెంత దూరదృష్టితో చెప్పింది! హో హో హో హో హో!!!

యజమాని: [చొక్కా వుండదు. బనీనుతో వుంటాడు. ధోవతి పైనుకట్టే. కాళ్లు, చేతులు, ముఖము కడుక్కొని, భార్య ఇచ్చిన తుండుగుడ్డతో తుడుచుకుంటూ ప్రవేశించుతాడు.] వచ్చి వచ్చి చివరకు పురాణం పట్టింటోళ్ళ తలకిందులు చేసినట్టుందే చూడగా!

మిత్రుడు: ఆఁ! యేమో! వంటరిగా కూర్చుంటే పూనుకోక.

భార్య: పురాణం అంటే వారూ వీరూ చెప్పేదనుకుని మీరట్టా అంటున్నారు. శాస్త్రుల్లుగారు చెప్పేదే పురాణం. వారు ఆ పద్యాలు చదువుతూ అందరికీ తెలిసేట్టు అర్థం చెబుతూంటే శ్రీ కృష్ణపరమాత్మ మురళి విని గోపికలందరూ ఆయన చుట్టూ యెట్టా మూగారో అట్టా మూగిపోవాలిసిందే జనం. అంత బాగుంటోంది. మీరూ వింటారుగా! నా మాట లబద్ధమేమో!

యజమాని: నా పాతివ్రత్యంకూడా యెందుకొక్కని; అమ్మాయి యింకా రాలేదే?

భార్య: సావిత్రి వాళ్ళింట్లోకి తమ్ముని పోజా చేయించుకు తింటోంది. ఇవాళ్టి పొద్దిటి పెట్టుండదు. [వంట యెంతవరకు వచ్చిందో చూట్టానికి లోపలికి వెడుతుంది.]

యజమాని: పొద్దిటి పెట్టక పట్టుకుంటుంది! పొద్దుటే పాదరిక్షకు పరుగేనా లేమిటి? పొంటిమిదాకి దేవుళ్ళ వస్తున్నకొద్దీ మరీ మరీ పోతోంది.

మిత్రుడు: వస్తుంది లేవయ్యా! చిన్న తనం; యిప్పుడు చెత్తనాలు చెయ్యకపోతే పెళ్ళి అత్తవారిళ్ళకు వెళ్ళాక చేస్తారా?

భార్య: [లోపలినుంచి వస్తుంది] ఇంతకూ వెళ్లిన పనేమైందండీ? కాయా, పండా?

యజమాని: యిప్పటిదాకా నీ వాళ్ల తెలియదు! నీ మనస్సంతా పురాణము, శాస్త్రుల్లు మీద లగ్నమైపోయింది. బాగుంది పురాణమూ, శాస్త్రులూ?

భార్య: కర్మంచాలక కాలు బయటపెట్టానో లేదో యిదీ వరస! మీరెప్పుడూ యింతే లెద్దురూ!

యజమాని: నీకంటికి యింతకాక మరెంతగా కనిపిస్తాను?

భార్య: పోనీలెద్దురూ! ఏ మాటన్నా తప్పైతే! (లోపలికి వెడుతుంది)

మిత్రుడు: ఏం! బావా! వెళ్ళింది వరాన్వేషణకా! వసూళ్ళకని బలేకథ అల్లావే!

యజమాని: యే కథలూ అల్లకుండా మీరంతా నిత్యా చేసేవన్నీ చేసినట్టే చెబుతున్నారు, మహా! గాంధీకి అన్నయ్యలు, తమ్ముళ్లూను!

మిత్రుడు: నా దగ్గర దాస్తావనుకుంటే అసలు కదిలించేవాణ్ణే కాదు.

యజమాని: దాయటాని కేముందిగాని; యెండీ పుల్లలు కాకుండా పైకనటం యెందుకు, తెలిపోతే తేలికా తామేమో అని.

భార్య: (లోపలినుంచి వస్తుంది) పిల్లను చూట్టానికి యెప్పుడొస్తామన్నారండీ? మళ్లా మామూలే. ఆపైన పుష్కరాలు. తమ్ముడూ! యెక్కడన్నా నోరు జారేవు? వాళ్ళో అన్నీ కోటిలే. అంతా విరోధులే. వేగలేకుండా వున్నాము.

యజమాని: కైటవాళ్ళ సంగతెట్టావున్నా ముందు నీతో వేగలేకుండా వున్నా. యే సంబంధం తీసుకొచ్చినా యేదోవంక పెడతావాయె. నిన్ను చూసి పిల్లా అపలుకే పలుకుతుంది. పైవారితే వాడిని నామాటేం సాగుతుంది?

భార్య: మీరూ మీ అమ్మాయి మంచివాళ్ళు! యెటొచ్చీ నేనేగా చెటాయింపు! అదికాదు తమ్ముడూ. ఈ మధ్యొచ్చిన సంబంధం తెచ్చారు; పిల్లవాడు నల్లగా దిపపుకోడిలా వుంటాడు. మా బంగారుతల్లికి మనసెట్టా ఒప్పుతుంది? తల అడ్డంగా తిప్పింది. నేను దానిచేత 'ఊఁ' అనిపించలేదని వీరికోపం.

యజమాని: పిల్లవాడు నల్లగా వున్నాడంటే తండ్రి నల్లని నలుపు. తల్లి మాత్రం పచ్చపసుపుకొమ్ములా పచ్చనిపసిమి. కొంపకు పారేదుకళ్ళు; కోటేరేసినట్టు ముక్కు......

భార్య: పిల్లవాడినిచూసా, తల్లినిచూసా పిల్లనిచ్చేది? ఆ సంబంధం అయితే వియ్యపురాలికళ్ళు, ముక్కు చూస్తూ వొళ్ళుమరిచే వాళ్ళేమో మరి!

[విసవిసా లోపలికి వెడుతుంది.]

యజమాని: ఆఁ! అదికాదోయ్! నేననటం, కనిముక్కుతీరు తల్లిపోలికొచ్చాయి; పోలిక తల్లి, రంగు తండ్రీను. తల్లినిబోలి పుడితే అదృష్టం కూడా అంటారు.

భార్య: [లోపలినుంచి] ఏమి అదృష్టమో! ఆ అమ్మాయి పుట్టాక, వాళ్ల ఆస్తంతా హరించుకుపోయిందట.

యజమాని: పుట్టటంవల్ల హరించుకుపోలేదు. పిల్లడికి పెద్దచదువులు చెప్పించారు. సీమకుపంపి యింజనీరు చదివించారు. అయినా ఆ ఆస్తంతా కట్టకుంది మునుపేగా! అందులో అయిదోవొంతుండదు, వాళ్ల కట్నం అడిగింది.

మిత్రుడు: మనదేశంనుంచి వల్లవాళ్ళు


## అతిమూత్రవ్యాధి
## నెమ్మదించును

మూత్రంలో చక్కెర పోవటం అతిమూత్ర వ్యాధి (DIABETES) అంటారు. ఇది ఎంత ఉపద్రవకరమైన వ్యాధి అంటే, దీని పాలబడినవారు ఆరోజుకారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి ఎక్కువగా దాహం, ఆకలి తరచుగా చక్కెరతోగాని, లేక చక్కెర లేకుండగాని మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి. వీనస్ చారమ్ అనేక సంవత్సరముల పరిశోధనల ఫలితంగా తయారు కాబడినది. దీన్ని వాడటంవల్ల వేనకు వేల మంది మృత్యుముఖమునుండి బయటపడ్డారు దీన్ని వాడితే రెండవ లేక మూడవ రోజు నుండే మూత్రంలో చక్కెర తగ్గించి అత్యధిక మూత్రంకూడా నివారిస్తుంది మూడు రోజుల తర్వాత మీకు బాగా తేలిక ఇస్తుంది దీనికి పత్యం లేదు ఇన్‌జెక్షన్లు అవసరం లేదు. వివరములు గల ఇంగ్లీషు కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపెదము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు.
ప్యాకింగు పోస్టేజి ఉచితము.

Venus Research Laboratory(A,P.W)
P. O. Box No. 587, Calcutta.

సీమకు చదువుకోటానికి వెడితే ఎందరాశే వీళ్ళుకోరినడిగ్రీ యిచ్చి పంపుతారట, యీనితనం అక్కడ యెక్కడ పడుతుందో అనే భయంతో.

భార్య : [త్వరత్వరగా వచ్చి మాట అందుకుని] నా భయమూ అదే! ఆయన తండ్రికి ఆయనలానే, ఆయనకు ఆయన పిల్లలూనూ, ఎలికలూ యెలుగ్గొడ్లూ. కట్నం దనకని కన్నపిల్లను కడతామా యే కొయ్యకు పడితే ఆకొయ్యకు ?

యజమాని : ఏదోవొకటి ! కొడుకు కన్నాం. అయిపోయిందిగా ! యింకెందుకే హైరాను పడతావు ?

మిత్రుడు : నువ్వు యెన్నైనా చెప్పు బావా! మొగవాళ్ళది యెంతసేపూ అర్థదృష్టి.

యజమాని : ఆడవాళ్ళది ? శూన్యదృష్టి! వాళ్ళకళ్ళతో చూస్తే పెళ్లిళ్ళు నిర్వాకం చేసినట్టే !

భార్య : కాకపోతే, పాటపాడిచినా అక్షరంముక్క లేనికోతికో కొండముచ్చుకో కోటూబూటూ తగిలించి, యేం లేకపోయినా బోలెడాస్తుంది, కట్టుకో మంటే యేపిల్ల కట్టుకుంటుందండీ యీ రోజుల్లో ?

యజమాని : నేనట్లా యెన్నడన్నా అన్నానుటే? ఆమాట లెక్కడ్నుంచొస్తున్నయ్యి, నోట్టోంచా కడుపులోంచే?

భార్య: మీ రనకపోతే మీ తమ్ముడుగా రాయిరి. మొగవాళ్ల తీరు చెబుతున్నా.

యజమాని: ఏమిటే! నా పిల్ల పెళ్ళిసంగతి నా తమ్ముడు కేమంత అవసరమొచ్చిందీ అంట, పట్టించుకోటానికి?

భార్య: అయ్యో! అంత సౌదర్యం కూడానా! మనమ్మాయి సంగతికాదు వారి పిల్ల విషయంలో నే.

యజమాని: ఏమి టేమిటే! యీ నాలుగు వాళ్ల మధ్య యేదన్నా మనుషు తెచ్చాడా యేం? హైదరాబాద సంబంధం వెనక్కి పోయిందట?

భార్య: అబాధ యెప్పుడో వొదిలింది. నిన్నకాక మొన్నసండీ! పిల్లను చూట్టాని కోపిల్లవాడు, ఆ అబ్బాయి అప్పమొగుడూ వచ్చారుట.

మిత్రుడు: ఆసంగతి నాకు తెలియదే! వూళ్లో నేవున్నా. నాకు తెలియకపోతే యేంగాని ముఖ్యంగా యెవరికి తెలియకుండా వుండాలని వాళ్లు కోరుకుంటారో ముందు వాళ్లకే తెలిసిపోతోంది.

భార్య: తెలిస్తే మాత్రం మేమేమీ పోటీలకు పోకూచోలేదు. మరిదిగారు తెచ్చే అంతోటి గొప్ప సంబంధాలకు.

యజమాని: ఏదో! వాడి తాహతువాడిది. కొసకి యేమైంది? పిల్లనచ్చలేదా యేమిటి?

భార్య: నచ్చకపోవటానికి పిల్లకేమండి? కొంచెం పళ్ళెత్తెతే మాత్రం. వాళ్ల అమ్మ పోలిక. అక్కడికేనయం, పొంతం రాలేదు.

యజమాని: తోడికోడలు అవాకొరని తను అప్సరసనని దీని కదోగర్వం. ముత్తానికి పోనిచ్చావు కాదే!

భార్య: పరేలెద్దరూ! అసలు సంగతి వినండి!, మీ మరదలు గడుసుదనం. చూడొచ్చిన వాళ్ళు మామూలుగా అంతా అడిగే ప్రశ్నలన్నీ వేశారు. సంగీతం వొచ్చా? చదువొచ్చా? యెందాకా చదివింది? యిట్లాంటివి. పిల్లవాడి చేతులో వున్న పత్రికముందు పడేసి చదవమన్నారుట. గడగడా చదివేసింది. చివరకు అటూ యిటూ నడవమన్నారుట. మరేం చేస్తారు, "నడమ్మా" అన్నారుట మరిదిగారు.

మిత్రుడు : వచ్చిన ప్రతివాడూ యీ కవాతులన్నీ చేయిస్తుంటే తల్లిదండ్రుల మాటేమోగాని పైన చూసే నాబోటిగాడికే అరికాలిమంట నెత్తికొస్తుంది.

యజమాని : నీ కేం తెలుస్తుందోయ్! అదృష్టవంతుడివి. ఆ పుట్టిన్నలుగురూ మొగ కూనలేగాని ఆడనలుసు పడలేదు.

భార్య : అప్పుడే యేమైంది? పురిటి కెళ్ళిందిగా మా మరదలు! ఆపళంగా మీ మరద లేంచేసిందో చూశారా! నాకుమల్లే గుడ్లప్పచెప్పి కూర్చోలా. "నాయనా! ఆప్పేరు నువ్వు కాస్త చదివ్వినిపించమండిట. యింకేముంది! అప్పమొగుడు మొఖం తిప్పేకాడు; అబ్బాయి గుడింతాలు నెమరెయ్యడం మొదలెట్టాడు. మరిదిగారు భార్య వేపు గుడ్లురిమార్ట! అంతటితో వూరుకో వచ్చా? "పోనీ పెళ్లామైనా చదువుకు నుంటే మంచిదే" అని, చద్రువ, పిల్ల నెయ్యివచ్చుకుని, లోపలికి తీసుకుపోయిందిట. [భర్త ఆ నేమాటలు వింటూ ముసిముసి నవ్వు నవ్వుతూ లోపలికి వెడుతుంది.]

యజమాని : కళ్లు కాదు, వాడి మొఖం పురిమాడు రాతు మెత్తనైతేసరి!

మిత్రుడు : ఏం బావా! ఆడవాళ్ళంటే చెంబు తప్పాలాలంటి వస్తువు లనుకుంటు న్నావుగామల్లు. నువ్వింకా పాతరం వెన కున్నావు. ఆడవాళ్ళకు మొగవాళ్ళతో పాటు సమానమైన హక్కులు కల్పిస్తోంది మన ప్రభుత్వం.

యజమాని : అట్లాగే కల్పిస్తుంది! నీబోటి యిచ్చకంగాళ్ళు అధికారంలో వుంటేసరి.

భార్య : [వెండిపళ్లెం పమిటచెంగుతో తుడుస్తూ లోపలినుంచి వచ్చి] వంటైందండీ! యింకా ఆలస్యం చెయ్యటం యెందుకు? లేచి స్నానం చెయ్యండి; మీకు నీళ్లు తోడా.

యజమాని : అంతా నాకు నీళ్లతోనే నా? ఇంత పొద్దుపోయిందే, మెయిలు వెళ్లిందికూడాను, పిల్ల యింటి కొచ్చిం దేమో చూడు! యిట్లా వుంది. నీ పెంపకం! మరీ హద్దు మీరిపోతోంది!

భార్య : బాగుందండోయ్! పిల్ల నేమీ అనలేరు మళ్లీ! అసలు మీ అబ్బురంవల్లే దానికి నా మాటంటే బొత్తిగా లక్ష్యం లేకుండా పోయింది. వెనకాల వస్తోందను కున్నా. సావిత్రితో వాళ్ళింటి కెళుతుందని నేనేం కలగన్నానా?

మిత్రుడు : పిచ్చాపాటి మాట్లాడుకుంటూ కూర్చుంటే మనకు టైము తెలిసిందీ? ఆ పిల్లా కాపరాని కెళ్ళాక యిదేగామల్లు పుట్టింటికి రావటం? సమవయస్కులు, బాల్య స్నేహితులు; ముచ్చట్లాడుకుంటూ కూర్చు నుంటారు. పోనీ, నేను పోయి పిలుచు కొస్తా. నువ్వీ లోపల స్నానంచేస్తూ వుండు, బావా!

యజమాని : నువ్వెందుకు లేవోయ్! నే నే వెడతాను.

భార్య : మీ రెందుకండీ! పొద్దుటినుంచీ భోజనం లేకుండా తిరిగి తిరిగొచ్చారు. నీళ్లు చల్లారిపోతే కూడా. మనుష్ళు గాని పనికి రావు మళ్ళా!

యజ: సరే! వెళ్లి రావోయ్! వొకళ్ళు వెళ్లి పిలుచుకొస్తే గాని యిల్లు పట్టకపోతే యెట్లాగంట? పొద్దుపోయిన గమనమన్నా లేకుండా! మరీ శృతిమించులోంది! (స్నానానికి వెడతాడు. భార్యకూడా వెడుతుంది. మిత్రుడు సావిత్రియింటికి బయలుదేరు తాడు. ఇంతలో మెయిల్ రన్నరు జేబులోనుంచి వుత్తరం తీస్తూ వచ్చి)

రన్నరు : ఏమండోయ్!

మిత్రుడు: ఏమోయ్! యిట్లా వచ్చావు?


## తెల్ల వెంట్రుకలుండవు

(GOVT REGD).

రంగులనుచూచి మోసపోవద్దు, అది తాత్కాలికము మా సువాసన "మన్ మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది. 60 సం॥ ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. జ్ఞాపకశక్తి కంటిచూపును వృద్ధిచేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 5-0-0. 3 సీసాలు రు. 12-0-0. సగము నెరసివుంటే ఒక సీసా రు. 6-0-0. 3 సీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/- లు 3 సీసాలు రు. 18/- లు పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి పూచీ.

GENERAL LABORATORIES,
(P. W) P. O. Rajdhanwar (H. Bhag.).

యజమాని: (బనీనుకూడా లేకుండా తుండు గుడ్డ కప్పుకుని ప్రవేశించి) ఎవరా వచ్చింది? నువ్వట్రా అబ్బాయి! పొద్దుపోయొచ్చావు? మీ నాయన పంపాడా? మినుములు రాసి తయారైందేం? ఏమిటది! ఉత్తరమా! యెవరిచ్చారు? (భార్యకూడా లోపలినుంచి వస్తుంది.)

రన్నరు: మెయిలుకి టపా తీసికెళ్లాను. రైలు కదలబోతుండగా బండిలోంచి నొకుర్రాయన్నన్ను పేరెట్టిపిలిచి, ఫలానావారి రైతు కొడుకువుకాదా అన్నాడు. అవునన్నాను. అయితే కాస్త యీ వుత్తర పట్టుకెళ్లి ఆయన గారి కివ్వు; వారింట్లో లేకపోతే వారిభార్య గారి కివ్వు అని యీ కవరిచ్చాడు.

యజ: (టేబులుదగ్గరకు వెళ్లి కళ్లజోడు తీసి తగిలించుకుంటూ) కుర్రాయనా? ఎన్నేళ్ళుంటై?

రన్నరు: పాతికేళ్లుంటయ్యో వుండవో. వస్తానండి, శలవిప్పించండి! (వెడతాడు)

యజ: (వుత్తరం విప్పి లోపల లోపల చదువుకో ప్రారంభించుతాడు. కాని వెంటనే వెనక్కు తిప్పి సంతకం చూస్తాడు. మళ్లా మొదటినుంచి తనలో చదువుకోటం మొదలుపెడతాడు. వుత్తరంలోని విషయాల వల్ల కలిగే మనోవికారాలు ముఖంలో ప్రస్ఫుటం అవుతూ వుంటవి. విపరీత దుఃఖమూ, ఆత్మాభిమానం దెబ్బతినటంవల్ల తెలియకుండా వచ్చే రోషమూ, హఠాత్తుగా సంభవించిన పరిణామ ఫలితంగా యేర్పడ్డ ఉద్రిక్తత యేకమై పొంగి పొర్లివస్తుంటే బలవంతాన ఆపుకుంటూ మతిపోయినవాడిలా కూర్చుంటాడు.)

భార్య: (గల్లంతు పడి) అయ్యో! ఏమిటండీ అది? యెవర్రాశారు? ఏముందండీ అందులో? చెప్పండీ!

యజ: (ఉత్తరం వున్న చెయ్యి భార్య వేపు జాపి చెప్పలుదక్కినట్టు వుంటాడు.)

భార్య: (ఉత్తరం తీసుకుని చదవబోయి) గంపెడు చత్వారంతో నేనేం చదువుతాను తమ్ముడూ! ఇదిగో చూడు.

మిత్రుడు: (చదువుతాడు) 'ప్రియమైన అమ్మకు నమస్కరించి'—

భార్య: ఆఁ! రాసిందెవరో చూడుముందు.

మిత్రుడు: 'ఇట్లు నీ ప్రియాతిప్రియమైన కూతురు శంప'—

భార్య: మా అమ్మాయా! మాశంపా! ఆ! చదువు! చదువు!

మిత్రుడు: 'నేను నీకు, నాన్న గారికి, తాత్కాలికంగానైనా దుఃఖం కలిగించే విధంగా నడుచుకోవాలిసొచ్చినందుకు దుర పిల్లుతున్నాను.'—

యజమాని: తాత్కాలికంగాయేం? శాశ్వతమే!

మిత్రుడు: 'తాత్కాలికంగాఅని ఎంచుకంటున్నానంటే, నాచేసినపనిసంప్రదాయ విరుద్ధంకాదనీ, బుధజనసమ్మతమైనదే ననీ ముందుముందు నిలకడమీద గ్రహించగలరని విశ్వసిస్తున్నాను. ఆవిశ్వాసమే యిప్పుడు నాకీధైర్యాన్ని యిచ్చింది.'—

యజమాని: ప్రజ్ఞ పేలాలైవట్టివుంది.

మిత్రుడు: 'మనసా ప్రేమించిన వారిని అనతికాలంలో వివాహమాడబోతున్నాను. యెవరికి తన హృదయాన్ని త్రికరణ యార్పణచేసిందో వారికి భార్యయై దాసియై వర్తించుటేగదా భారతస్త్రీకి విధ్యుక్త ధర్మము! నే నాపురాణధర్మాన్ని పాటించి నావిధ్యుక్తవిధిని నిర్వహిస్తున్నాను. ఇవన్నీ నేను నీకువేరె చెప్పనక్కరలేదనుకుంటాను.'

యజమాని: నిజం!

మిత్రుడు: 'నేను యేమహామహుని పెండ్లాడబోతున్నానో వారి యూరుపేరులు మాత్రమిప్పుడు బయలుపరుపదలచలేదు. నీకిది హృదయశల్యము కావచ్చు. అట్లు కాకుండుటకు ఒక్క విషయముమటుకు వ్రాయుదును. ఎవ్వరి శుభాకారమీక్షింప యే ప్రొద్దు నాకన్ను లెదురుచూచునో, ఎవ్వరిగుణములు కర్ణేంద్రియంబులసోక నా దేహతాపంబులు తీరిపోవునో, ఎవ్వరిలసన్నామ మనిశంబు భక్తి నామనసున మననంబుచేతునో, ఎవ్వరి చరణసేవ యేవేళనానరింప యిలువెడలి నేనిప్పుడేగుచుంటినో అట్టి నా హృదయాధి దైవము విద్యారూపతారుణ్య సౌజన్యశ్రీ బలదానశౌర్య కరుణాసంశోభితులు.'—

యజమాని: ఎక్కడిపాండిత్యమే యిది! కొంపతీసింది!

మిత్రుడు: 'అయితేనేం. తండ్రిగారికి మాత్రము విరోధివర్గములోనివారు. వారికి నా మనోగతాభిప్రాయమును యెరుకపరచి యుండునేని నన్ను కఠోరముగా దూషించి నా వాంఛాపరిపూర్తి కవరోధములు అన్నివిధముల కల్పించి యుండెడివారు. అందుచే వారికి మనసులోని మాట చెప్పనైతిని. వారును పరుల వరులుగా నాకై అన్వేషించుచుండిరి. నా ప్రాణవల్లభుడు పురుషసింహము'.

యజమాని: వెధవ! గ్రామసింహం!

మిత్రుడు: 'సింహమునకు దక్కవలసిన నేను గోమాయువు పాలబడుటకిచ్చగింతునా? తండ్రిగారి తలంపు నే నెరిగిన దాననగుట, లోన నెంత ఆపన్నత నొందితినో నీకేమి తెలియును. చనవు కలదాననని నీకు నా యింగిత మెరిగించినను ప్రయోజన ముండ దని నాకు తెలియును. నన్నన్యుల కియ్యకుండ నాన్న గారిని వారించుశక్తి నీకెట్లునూ లేదు. అందులకే యీ సాహసము. నే చేసినది తప్పుకాదని నా అంతరాత్మ పదే పదే ఘోషించుచున్నది. నాన్న గారు, నీవు, నన్నల్లారుముద్దుగా పెంచితిరి. మీకు సర్వదా కృతజ్ఞురాలను. కాల మనుకూలించినప్పుడు నేను, నా భర్తగారు, మీ ఆశీర్వాదము కొరకు రాగలము.'

యజమాని: ఆశీర్వాదానికా? ఆస్తి కోసమా? చిల్లిగవ్వ దక్కనివ్వను. దత్తత చేసుకుంటాను.

మిత్రుడు: 'అమ్మా! యింక శలవు. నాన్న గారికి నా ప్రేమపూర్వక నమస్కారములు అందచెయ్యి. మనమంతా కలుసుకోటాని కనువైన సమయం త్వరలో వస్తుందని ఆశిస్తున్నాను. ఇట్లు నీ ప్రియాతిప్రియమైన కూతురు శంప'.

భార్య: ఎంత సాహసం చేశావే కూతురా! యిదంతా మాకర్మ.

యజమాని: (దుఃఖ రోషావేశాలతో) సిగ్గుమాలినపని! సాహసంటే యిది? సాహసం! యెందులోనన్నా పడి చావక పోయింది!

మిత్రుడు: పరాయివాళ్ళెదట తలెత్తి తిరిగెరగదే యెప్పుడూ! నాతో మాట్లాడుతున్నా తలవొంచుకునే వుండేదికాదుటమ్మా? ఏవిఁటో! కాలప్రభావం!

యజమాని: కర్మప్రభావంకాదు, కాల ప్రభావంకాదు. ఆరాతమూస్తే తెలీటంలా! ఏ ప్రభావమో?! ఎందుకే అట్టా చూస్తావు? నిన్నేమీ అనదలుచుకోలేదే అమ్మా! (లేచి నిమ్మళంగా యింట్లోకి వెడతాడు. భార్య, వెనకాలే, తలవంచుకు నడుస్తుంది. మిత్రుడు వారివంక జాలిగాచూస్తూ నుంచుంటాడు. తెరపడుతుంది.) ★





